# ప్రశాంతంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్

- జిల్లాలో 94.13 శాతం నమోదు
- సంగెం మండలంలో అత్యధికం
- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్



ఇస్లామియా కళాశాలలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ సత్యశారద

ఖిలావరంగల్, ఫిబ్రవరి 27: వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గురువారం జిల్లాలోని 13 మండలాల్లో ఏర్పాటు చేసిన 13 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 8 నుంచి ఓటింగ్ ప్రక్రియ మొదలైంది. సాయంత్రం నాలుగు గంటల వరకు 94.1 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తంగా 2,352 మంది ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లలో 1,474 మంది పురుషులు, 878 మంది మహిళా ఓటర్లు ఉండగా 2,214 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం పోలింగ్ మందకొడిగా ప్రారంభమైనప్పటికీ సాయంత్రం 4 గంటల వరకు క్యూలో ఉన్న ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు అధికారులు అవకాశం కల్పించారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. జిల్లాలో అత్యధికంగా సంగెంలో 98.5 శాతం, అతి తక్కువగా రాయపర్తిలో 90.9 శాతం ఓటింగ్ నమోదైంది. అలాగే, వర్ధన్నపేటలో 97.8 శాతం, నెక్కొండలో 97.2, ఖానాపూర్‌లో 94.5, నర్సంపేటలో 94.9, చెన్నారావుపేటలో 94.9, పర్వతగిరిలో 97.4, నల్లబెల్లిలో 95.2, దుగ్గొండిలో 91.7, గీసుగొండలో 94.4, వరంగల్‌లో 93.1, ఖిలావరంగల్‌లో 94 శాతం పోలింగ్ నమోదైంది. కాగా, జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన లైవ్ వెబ్ కాస్టింగ్ ద్వారా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వీక్షించారు. అనంతరం సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలిమాతో కలిసి పలు కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్స్‌లకు సీల్ వేసి, ప్రత్యేక వాహనాల ద్వారా భారీ బందోబస్తుతో నల్లగొండ జిల్లాకు తరలించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉపాధ్యాయులు ఎక్కువ సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకున్నారనికలెక్టర్ తెలిపారు.

**పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు**

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : వరంగల్ నర్సంపేట రోడ్డులోని ఇస్లామియా కళాశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని వరంగల్ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ సత్యశారద, వరంగల్ సెంట్రల్ డీసీపీ షేక్ సలీమా పరిశీలించారు. నర్సంపేటలో పోలింగ్ కేంద్రాన్ని ఏసీపీ కిరణ్‌కుమార్, తహసీల్దార్ రాజేశ్, టౌన్ సీఐ రమణమూర్తి పరిశీలించారు. వర్ధన్నపేటలో తహసీల్దార్ విజయ్‌సాగర్, ఎస్సైలు చందర్, రాజు, రాయపర్తిలో వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, ఎస్సై కొంగ శ్రవణ్‌కుమార్, ఖానాపురంలో మండల నోడల్ ఆఫీసర్ సునీల్ రాజ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రాజా రేణుక, సంగెంలో మామునూరు ఏసీపీ తిరుపతి, పర్వతగిరి సీఐ రాజ గోపాల్, పర్వతగిరిలో తహసీల్దార్ వెంకటస్వామి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

## దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు

సంగెం, ఫిబ్రవరి 27 : ఒకరిపై దాడి చేసిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదైంది. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. మండలంలోని వీఆర్ఎన్ తండాకు చెందిన గుగులోత్ రాజుపై అదే గ్రామానికి చెందిన గుగులోత్ రవీందర్, గుగులోత్ దేవేందర్ ఇటుకలతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## సట్టా ఆడుతున్న ఇద్దరి అరెస్టు

కరీమాబాద్, ఫిబ్రవరి 27 : మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖిలావరంగల్, క్రిస్టియన్ కాలనీలో గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు చేపట్టిన దాడుల్లో సట్టా ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నగదుతో పాటు సెల్‌ఫోన్లు, సట్టా స్లిప్‌లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల కోసం వారిని మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు.

## మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



శివకృష్ణాచారి(ఫైల్)

కాశీబుగ్గ, ఫిబ్రవరి 27 : మద్యానికి బానిసై ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన 14వ డివిజన్ బాలాజీనగర్‌లో చోటు చేసుకుంది. ఎనుమాముల సీఐ అలే రాఘవేందర్ కథనం ప్రకారం.. బాలాజీనగర్‌కు చెందిన జక్కోజు శివకృష్ణాచారి (31) కూలి పని చేస్తుండేవాడు. మద్యానికి బానిస కావడంతో రోజూ భార్యభర్తల మధ్య గొడవలు జరిగేవి. ఈ క్రమంలో బుధవారం మద్యం సేవించి ఇంట్లోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. భార్య, తల్లి కొద్దిసేపటి తర్వాత తలుపు కొట్టినా తీయకపోతే కిటికీలోంచి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతిచెంది ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సంగెం/గీసుగొండ, ఫిబ్రవరి 27 : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఆర్‌బీఐ లీడ్ జిల్లా అధికారి పల్లవి అన్నారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా సంగెం మండలం పల్లార్‌గూడలో టీజీబీ మచ్చాపూర్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపరిచితులకు సీవీవీ, అకౌంట్ నంబర్, ఓటీపీలు చెప్పవద్దన్నారు. గీసుగొండ మండలం మచ్చాపురంలోనూ అవగాహన కల్పించారు. ఎల్‌డీఎం హవేలి రాజు, నోడల్ అధికారి శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్, భాస్కరాచారి, బ్యాంకు మేనేజర్ స్వాతి, మౌనిక, శ్రీకాంత్, రాజేశ్ పాల్గొన్నారు.

## ‘దుండగులకు శిక్షించాలి’

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 27 : భూపాలపల్లి జిల్లాలో మంత్రాల నెపంతో సారపాక వీరమ్మను చంపిన దుండగులను కఠినంగా శిక్షించాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★లేడీ టెలికాలర్స్, బ్యాగ్‌రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

PASSPORT MISSING

★ I, Mohammed Anwer S/o Late Yakub Ali, R/o H.No. 2-9-1232, Waddepally, Hanumakonda Dist. I lost my Passport. Passport No. H0389081 While Travelling by Bike from Waddepally to Subedari. So if found Please let me know Contact Cell: 7330516331.
NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

## విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి రైతు బలి

### స్టార్టర్ సరిచేస్తుండగా విద్యుదాఘాతం



వెంకటేశ్వర్లు(ఫైల్)

వర్ధన్నపేట, ఫిబ్రవరి 27 : విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యానికి రైతు బలైన ఘటన మండలంలోని ల్యాబర్తి గ్రామంలో గురువారం జరిగింది. గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ల్యాబర్తి గ్రామానికి చెందిన బల్గూరి వెంకటేశ్వర్లు(51) యాసంగిలో వరి పంట సాగు చేస్తున్నాడు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆన్ ఆఫ్ సిస్టమ్ సరిగా లేకపోవడంతో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీని వల్ల మోటర్లు సరిగా నడవకపోవడంతో వరి పొలం ఎండిపోయే పరిస్థితికి వచ్చింది. పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయింది. దీంతో పంట ఎండిపోతుందనే భావనతో వెంకటేశ్వర్లు తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. అలాగే, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమస్య కారణంగా మోటర్ స్టార్టర్‌లో కూడా ఇబ్బంది ఏర్పడింది. గురువారం ఉదయం పొలానికి నీరు పారించేందుకు వెళ్లిన వెంకటేశ్వర్లు స్టార్టర్ వద్ద ఏర్పడిన సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలోనే ఒక్కసారిగా కరెంటు షాక్‌కు గురై పొలంలో పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. చుట్టుపక్కల రైతులు విషయాన్ని గుర్తించి అతని కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య శ్రీదేవి, కూతురు ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

## యథేచ్ఛగా మద్యం అమ్మకాలు

### ఎన్నికల కోడ్‌ను అమలు చేయని అధికారులు

ఖిలావరంగల్, ఫిబ్రవరి 27 : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌లో భాగంగా ఎన్నికల కమిషన్ మద్యం అమ్మకాలపై ఆంక్షలు పెట్టింది. ఈ నెల 25 సాయంత్రం 4 నుంచి 27 సాయంత్రం 4 గంటల వరకు మద్యం విక్రయాలు జరపకూడదని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అయితే, కేవలం వైన్స్, బార్ అండ్ రెస్టారెంట్లకు సీల్ వేసి ఆయా శాఖలు చేతులు దులుపుకున్నాయనే ఆరోపణలున్నాయి. చింతల్, పుప్పాల గుట్ట, ఏసిరెడ్డినగర్, పడమర కోట, మధ్యకోట, తూర్పుకోట, రైల్వేగేటు ప్రాంతాల్లోని బెల్టు షాపుల్లో విచ్చల విడిగా మద్యం విక్రయాలు నిర్వహించారు. ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. అయినా అడ్డుకోకపోవడంపై సంబంధిత శాఖల అధికారులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మొగిలిచెర్లలో భారీగా మద్యం పట్టివేత



పట్టుకున్న మద్యంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

గీసుగొండ, ఫిబ్రవరి 27 : గ్రేటర్ 15వ డివిజన్ మొగిలిచెర్ల గ్రామంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది గురువారం భారీగా మద్యం పట్టుకున్నారు. గ్రామంలోని మంద సాంబయ్య, బేల పూర్ణచందర్ బెల్టు షాపులపై దాడులు చేశారు. ఈ సందర్భంగా సాంబయ్య ఇంట్లో రూ.48,270, పూర్ణచందర్ ఇంట్లో 76,040 విలువైన మద్యం, బీర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ మధుసూదన్ తెలిపారు. మద్యాన్ని సీజ్ చేసి, ఇద్దరిపై కేసు నమోదు చేసి గీసుగొండ సీఐ మహేందర్‌కు అప్పగించినట్లు వివరించారు.

## అశోక్‌నగర్‌లో ప్రభుత్వ స్థలం కబ్జా

### భూమి చదును చేస్తుండగా అడ్డుకున్న స్థానికులు

ఖానాపురం, ఫిబ్రవరి 27 : మండలంలోని అశోక్‌నగర్‌లో ప్రభుత్వ స్థలాన్ని ఓ రాజకీయ పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు అక్రమంగా చదును చేస్తుండగా గురువారం స్థానికులు అడుకున్నారు. దీంతో తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుక ఉన్న ప్రభుత్వ స్థలాన్ని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమించి కొద్ది రోజుల క్రితం టిప్పర్లతో మట్టి పోయగా స్థానికులు అడ్డుకోవడంతో మట్టిని అక్కడే కుప్పలుగా పోసి వెళ్లిపోయారు. మళ్లీ గురువారం ఉదయం వచ్చి డోజర్‌తో మట్టిని చదునుచేసేందుకు ప్రయత్నిస్తుండగా స్థానికులు మరోసారి అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది, పోలీస్ అధికారులు అక్కడికి చేరుకున్నారు. ఇరువర్గాలను శాంతింపజేసి, డోజర్‌ను అధికారులు తీసుకెళ్తుండగా రాజకీయ నాయకుల నుంచి ఒత్తిడి రావడంతో అధికారులు డోజర్‌ను అక్కడే వదిలి వెళ్లారు. కొద్ది రోజులుగా భూములను ఆక్రమించుకుని చదును చేసి, ప్లాట్లు చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామంలోని ప్రభుత్వ స్థలాలన్నీ ఆక్రమణకు గురవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయమై ఇన్‌చార్జి తహశీల్దార్ రాజేశ్‌ను వివరణ కోరగా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## శనగ చేనుకు కిరాయి ట్యాంకర్‌తో సాగు నీరు

### పంటను కాపాడుకునేందుకు రైతు దాసునాయక్ కష్టాలు



నీటితో చేను తడుపుతున్న రైతు దాసు నాయక్

పర్వతగిరి, ఫిబ్రవరి 27 : మండలంలోని రావూరు శివారు సీత్యా తండాలో రైతు రమావత్ దాసునాయక్ కిరాయి ట్యాంకర్‌తో సాగు నీరు తెచ్చి తన శనగ చేనును కాపాడుకుంటున్నాడు. దిగుబడి వచ్చే క్రమంలో నీటి సౌకర్యం లేకపోవడంతో వేరే గ్రామం నుంచి నీటిని కిరాయి ట్యాంకర్‌లో తీసుకొచ్చి చేను పీకడానికి ఏర్పాట్లు చేసి తడుపుతున్నట్లు రైతు చెప్పాడు. తన పంట చేను పక్క నుంచే ఎస్సారెస్పీ కెనాల్ ఉన్నా నీటి సౌకర్యం లేదని విచారం వ్యక్తం చేశాడు. ఇలాంటి దౌర్భాగ్యమైన ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదన్నారు. బోర్లు, వ్యవసాయ బావుల్లో భూగర్భ జలాలు అడుగంటి పోయాయని ఆవేదన వ్యక్తం చేశాడు.

# లారీ ఢీకొని భార్యాభర్తల దుర్మరణం

- బతుకుదెరువు కోసం వెళ్లి వస్తుండగా ములుగు జిల్లా మల్లంపల్లి వద్ద ఘటన
- మృతులు బుధరావుపేట వాసులు
- గ్రామంలో అలుముకున్న విషాద ఛాయలు



ఘటనా స్థలంలో లారీ కింద పడి నుజ్జునుజ్జయిన బైక్, (ఇన్‌సెట్‌లో) మహమూద్(ఫైల్)

ములుగురూరల్/ఖానాపురం, ఫిబ్రవరి 27 : లారీ ఢీకొని దంపతులు మృతి చెందిన ఘటన ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రం శివారులో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం బుధరావుపేటకు చెందిన దంపతులు ఎండీ మహమూద్(58), షహీనా(45) పొట్టకూటి కోసం ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్‌లో పని నిమిత్తం వెళ్లారు. గురువారం స్వగ్రామమైన బుధరావుపేటకు మహమూద్ తన ఎక్సెల్ బండిపై భార్య షహీనను తీసుకొని వస్తున్నాడు. మల్లంపల్లి క్రాస్ నుంచి నర్సంపేట వైపు వెళ్తున్న క్రమంలో ఎదురుగా వేగంగా వస్తున్న లారీ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ములుగు ఎస్సై వెంకటేశ్వర్‌రావు ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

**బుధరావుపేటలో విషాదం**

ములుగు జిల్లా మల్లంపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బుధరావుపేటకు చెందిన షేక్ మహమూద్, షహీనా దంపతులు మృత్యువాత పడడంతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద కుటుంబానికి చెందిన వీరు బతుకుదెరువు నిమిత్తం ఊరూరు తిరుగుతూ రెడిమేడ్ బట్టల వ్యాపారం చేసుకుంటున్నారు. కొద్దో గొప్పో కూట బెట్టుకుని తిరిగి ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా లారీ ఢీకొట్టడంతో దంపతులిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా, ఒక కుమారుడు, కుమార్తెకు మాత్రమే వివాహాలు జరిగాయి. తల్లిదండ్రుల మృతితో కుటుంబం వీధిన పడినట్లయిందని గ్రామస్తులు కన్నీటి పర్యంతమవుతున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, షేక్ మౌలానా కోరారు.

# నగరంలో జోరుగా గుట్కా వ్యాపారం

- పట్టుకోవాల్సిన వారే కాపలా?
- సిటీలోనే సాగుతున్న హోల్ సేల్ అమ్మకాలు
- పొగాకు ఉత్పత్తులకు బానిసవుతున్న యువత



పిన్నవారివీధిలో ఇటీవల టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న గుట్కా నిల్వలు(ఫైల్)

వరంగల్ చౌరస్తా, ఫిబ్రవరి 27 : ఓరుగల్లు నగరం అక్రమ వ్యాపారాలకు నిలయంగా మారింది. యువత భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని, క్యాన్సర్ రహిత సమాజంగా తెలంగాణను నిలిపాలని కేసీఆర్ ప్రభుత్వం గుట్కాలు, పొగాకు ఉత్పత్తులను నిషేధించి, అక్రమ రవాణాకు అడ్డకట్ట వేసింది. కానీ, ప్రస్తుత ప్రభుత్వం నిషేధిత ఉత్పత్తుల రవాణాపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో నగరం నడిబొడ్డున గుట్కా వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతుంది. యువతను టార్గెట్‌గా చేసుకొని చాపకింది నీరుగా వ్యాపారం విస్తరిస్తున్నది. అడపాదడపా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి పట్టుకుంటున్నప్పటికీ అసలు వ్యాపారంలో అది కనీస మొత్తంగానే గుర్తించగలుగుతున్నారు. ప్రతిసారీ రూ.లక్షల్లో పట్టుబడుతున్నా దందా ఆగడం లేదంటే ఏ స్థాయిలో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు చేసి, కేసులు నమోదు చేసి స్థానిక పోలీసులకు అప్పగించడంతో విషయం నీరుగారిపోతుందని, స్థానిక పోలీసులు కఠిన చర్యలు చేపట్టకపోవడంతో అక్రమ వ్యాపారం చేస్తున్న వారికి భయం లేకుండా పోతున్నదని పలువురి వాదన.

**అడ్డుకట్ట వేయాల్సిన వారే కాపలా?**

యువతను నిర్వీర్యం చేసే మత్తు, పొగాకు ఉత్పత్తులను ప్రభుత్వ నిషేధించగా, సర్కారు లక్ష్యం దిశగా అడుగులు వేయాల్సిన పోలీసులు కొందరు అక్రమ వ్యాపారం చేస్తున్న ఇతర రాష్ట్రాల వ్యాపారులతో సంబంధాలు కలిగి ఉండి రవాణా, నిల్వ వ్యవహారాలలో వారికి సహకరిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. గిర్మాజీపేట ప్రాంతానికి చెందిన ఓ అక్రమ గుట్కా వ్యాపారి నగర సమీపంలోని విలీన గ్రామంలో గోదాంలో సరుకు నిల్వ చేసి అమ్మకాలు చేపడుతున్న విషయం నగరంలోని ప్రతి పాన్‌షాపు నిర్వాహకుడికి తెలిసిందే. నగరం నడిబొడ్డున ఉన్న పిన్నవారి వీధిలో ఉత్తర భారత దేశం నుంచి వచ్చిన వ్యాపారులు బహిరంగ మార్కెట్‌లో చేసే వ్యాపారాల్లో చాలా వరకు అక్రమ వ్యాపారాలే ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న అక్రమ నిల్వలు చాలా వరకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులవే కావడం అందుకు నిదర్శనం. తమ అక్రమ వ్యాపారాన్ని కాపాడుకోవడం కోసం అధికార పార్టీ నాయకుడితో కలిసి ఒప్పందాలు కుదుర్చుకోవడంతో పాటు స్థానిక పోలీసులను సైతం మ్యానేజ్ చేసినట్లు చిన్న స్థాయిలో అమ్మకాలు జరిపే వ్యాపారులు చెవులు కొరుక్కుంటున్నారు. నిత్యం రూ.కోట్ల వ్యాపార లావాదేవీలు కొనసాగే కేంద్రాలపై పోలీసులు నిఘా ఏర్పాటు చేయకపోవడం, నిషేధిత ఉత్పత్తులు ప్రతిసారీ టాస్క్‌ఫోర్స్ వారికి మాత్రమే పట్టుబడడం, స్థానిక పోలీసులు తనిఖీలు చేపట్టకపోవడంతో ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# కాలుష్య కోరల్లో చారిత్రక ఖిల్లా

- పర్యాటకులకు తప్పని ఇబ్బందులు
- కోట ప్రధాన రహదారిలో చెత్త డంప్
- చోద్యం చూస్తున్న బల్దియా అధికారులు

ఖిలావరంగల్, ఫిబ్రవరి 27: ఓరుగల్లు ఖిల్లాకు చెత్త కాలుష్యం పట్టుకుంది. ప్రకృతి అందాలు, సుప్రసిద్ధ కళాఖండాలను వీక్షించి కాకతీయుల కీర్తి ప్రతిష్టలను గురించి గొప్పగా ఊహించుకొని కోటకు వచ్చే పర్యాటకులకు ఈ చెత్త అనేక ఇబ్బందులను తెచ్చిపెడుతోంది. లెక్కకు మించి ఆదాయం సమకూరుతున్నా పర్యాటకులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలనే ఆలోచన కేంద్ర పురావస్తు, బల్దియా, పర్యాటక శాఖల్లో కనిపించడం లేదు. ఫలితంగా పర్యాటకులు ముక్కు మూసుకొని చారిత్రక, వారసత్వ కళాఖండాలను వీక్షించాల్సి వస్తోంది. ఖిల్లా కోటకు ఏ ప్రవేశ ద్వారం నుంచి లోపలికి వచ్చినా చెత్త కుప్పలే ముందుగానే దర్శనమిస్తున్నాయి. బల్దియా అధికారులు అవేం పట్టించుకోకుండా నగరంలో ఇంటింటా సేకరించిన చెత్తను నేరుగా తీసుకువచ్చి కోట ప్రాంతంలోనే డంపు చేస్తున్నారు. దీంతో దుర్వాసనతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా తీసుకొచ్చిన చెత్తను ఇక్కడే తగులపెడుతుండంతో కోట ప్రాంతంలో కాలుష్యం అలుముకుంటున్నది. చెత్తను కాల్చకుండా నేరుగా డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉండగా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కింది స్థాయి సిబ్బంది ఇలా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శంభునిపేట నుంచి పడమర కోటకు వచ్చే కోట గండి వద్ద, ఖమ్మం రోడ్డు నుంచి పడమర కోటకు వచ్చే కోట ద్వారం వద్ద, అలాగే, చింతల్ నుంచి కోటకు వచ్చే ఉత్తర ద్వారం వద్ద, దూపకుంట నుంచి కోటకు వచ్చే మట్టికోట దక్షిణ ద్వారం వద్ద నిత్యం చెత్తను కాలుస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, కోట పరిసర ప్రాంతాల్లో చెత్త డంపు చేయకుండా చర్యలు తీసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.



దూపకుంట నుంచి మట్టికోటకు వచ్చే ద్వారం వద్ద కాలుతున్న చెత్త డంపు



మట్టికోట ఉత్తర ద్వారం వద్ద చెత్త కాల్చేయడంతో రోడ్డుపై కమ్ముకున్న పొగ



రాయపర్తిలో బాధితులను పరామర్శిస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

## అధైర్య పడొద్దు అండగా ఉంటా

### మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


రాయపర్తి, ఫిబ్రవరి 27 : పెద్ద దిక్కు కోల్పోయిన బాధిత కుటుంబాలు అధైర్య పడవద్దని, భవిష్యత్‌లో తాము అండగా ఉంటూ అన్ని విధాలుగా ఆదుకుంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని బురహాన్‌పల్లిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పిట్టల సుధాకర్ తండ్రి పిట్టల సోమయ్య, మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన బీఆర్ఎస్ యూత్ నాయకుడు ఐత రాకేశ్ తండ్రి ఐత ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం బాధిత కుటుంబాలను కలిసి పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్, పూస మధు, గారె నర్సయ్య, లేతాకుల రంగారెడ్డి, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, బాపురెడ్డి, తాళ్లపల్లి రాజు, కిషన్, కొమ్ము రాజు, బుచ్చిరెడ్డి, ముంజాల రవీందర్, అయిత రాంచందర్, చందు రామ్‌యాదవ్, సతీశ్‌యాదవ్, అయిత రవి, కుమార్, మైస వెంకటేశం, కంతుల జంపి, చంద్‌నాయక్ ఉన్నారు.



మహేశ్‌కు అవార్డు అందజేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

## రెజ్లింగ్ కోచ్‌కు మాజీ మంత్రి అభినందన

నర్సంపేట, ఫిబ్రవరి 27 : మండలంలోని గురిజాల గ్రామానికి చెందిన రెజ్లింగ్ కోచ్ సిరపురపు మహేశ్‌ను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అభినందించారు. రెజ్లింగ్ కోచ్‌గా ఎంతో మంది విద్యార్థులు, ఉద్యోగార్థులకు చక్కటి శిక్షణ ఇస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్న మహేశ్ ప్రతిభను గుర్తించి, ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలో బుధవారం రాత్రి జరిగిన వేడుకల్లో కాకతీయ పురస్కారం అవార్డును మాజీ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజయ్య తదితరులున్నారు.



యస్వితకు ఆర్థికసాయం అందజేస్తున్న లేతాకుల రంగారెడ్డి

## నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం

రాయపర్తి, ఫిబ్రవరి 27 : మండలంలోని జగన్నాథపల్లి గ్రామానికి చెందిన నిరుపేద నారబోయిన మధుసూదన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుమార్తె నారబోయిన యస్వితకు గురువారం నూతన ఫల, పుష్ప అలంకరణ మహోత్సవం జరిగింది. విషయం తెలుసుకున్న మైలారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తన చిన్ననాటి మిత్రుడు మధుసూధన్ కుమార్తె ఫంక్షన్‌లో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు లేతాకుల రంగారెడ్డి, గజవెల్లి ప్రసాద్, గారె రవీందర్‌రెడ్డి, మహ్మద్ యూసఫ్, అష్రఫ్‌అలీ చేతులతో రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న అల్లం స్వప్నాదేవి

## బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

గీసుగొండ, ఫిబ్రవరి 27 : వివిధ కారణాలతో దవాఖానలో చికిత్స పొందుతున్న మనుగొండ గ్రామానికి చెందిన హైమావతి, శాయంపేట గ్రామానికి చెందిన సమద్రాల శ్రవణ్‌ను గురువారం వ్యాపార వేత్త అల్లం బాలకిశోర్‌రెడ్డి సతీమణి స్వప్నాదేవి పరామర్శించారు. దవాఖానలకు వెళ్లి వారిని పరామర్శించి ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. అనంతరం వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వీరగోని రాజ్‌కుమార్, మర్రెడ్డి, సతీశ్ పాల్గొన్నారు.



జయశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్‌రెడ్డి తదితరులు

## మృతురాలి కుటుంబానికి పరామర్శ

నర్సంపేట, ఫిబ్రవరి 27 : పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపార వేత్త, జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం సలహాదారుడు గోగుల ప్రతాప్‌రెడ్డి భార్య గోగుల జయశ్రీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని గురువారం బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకట నారాయణగౌడ్, మాజీ ఎంపీపీ నల్లా మనోహర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, రాయిడి రవీందర్ రెడ్డి, క్లస్టర్ బాధ్యులు బండి రమేశ్, మండల శ్రీనివాస్, దేవోజు సదానందం, చుక్క అనిల్, రవీందర్, సాంబయ్య, యాదగిరి తదితరులు పరామర్శించారు. అలాగే, రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు కుల సంఘం బాధ్యులు కూడా పరామర్శించారు. జయశ్రీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు ఎర్ర జగన్మోహన్‌రెడ్డి, బొమ్మనపల్లి కేశవరెడ్డి, డాక్టర్ మోహన్‌రావు పాల్గొన్నారు. అలాగే, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, తహసీల్దార్ రాజేశ్‌తో పాటు పలువురు వైద్యులు, అధికారులు కూడా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.